పనులు పూర్తికాక ఏటా గండ్లు

- అసంపూర్తిగా నారాయణపూర్ రిజర్వాయర్ పనులు
- ఎల్లమ్మ, నారాయణపూర్ చెరువులను కలపాలని డిమాండ్
- నిధుల మంజూరుకు నీటిపారుదల శాఖ మంత్రి హామీ

రిజర్వాయర్ పేరు : నారాయణపూర్	
సామర్థ్యం	: 0.3 టీఎంసీలు (300 ఎంసీ ఎఫ్టీలు)
కట్ట ఎత్తు	: 1.45 మీటర్లు
కట్ట వెడల్పు	: 1.45 మీటర్లు


నారాయణపూర్ చెరువు

రిజర్వాయర్‌ను నింపే పంపులు


చెరువు మత్తడి పరిస్థితి


మత్తడి ముందు వేసిన కట్టకు గండి

గంగాధర: చెరువులు, కుంటలు నింపడంతో పాటు కాలువల ద్వారా వేలాది ఎకరాలకు సాగు నీరందించడం, తాగునీటి సమస్య పరిష్కారానికి ఉపయోగపడే నారాయణపూర్ రిజర్వాయర్ పనులు ప్రారంభించడంలేదు. ఎల్లంపల్లి ప్రాజెక్టు నుంచి నందిమేడారం చెరువుకు నీటిని తరలించి అక్కడి నుంచి పంపింగ్ ద్వారా నారాయణపూర్ చెరువుకు నీటిని తరలిస్తారు. ఇక్కడి నుంచి కరీంనగర్, జగిత్యాల, రాజన్నసిరిసిల్ల జిల్లాల్లోని వ్యవసాయ భూములకు సాగునీరందిస్తారు. మేడారం నుంచి నారాయణపూర్ చెరువు వరకు పైపులైన్ పనులు పూర్తయి నీటి తరలింపు ప్రక్రియ జరుగుతోంది. రిజర్వాయర్ నుంచి ఎగువ ప్రాంతాలకు పైపులైన్, పంప్‌హౌజ్ పనులు పూర్తి చేసి నీటిని తరలిస్తున్నారు. ఇతర ప్రాంతాలకు నీటిని తరలించడానికి కేంద్ర బిందువైన నారాయణపూర్ రిజర్వాయర్ పనులు మాత్రం ఏళ్లు గడుస్తున్నా ప్రారంభంకావడంలేదు. గంగాధర ఎల్లమ్మ చెరువు, నారాయణపూర్ చెరువులను కలిపి రిజర్వాయర్‌గా చేయాలి. 0.3 టీఎంసీల సామర్థ్యం గల నారాయణపూర్ రిజర్వాయర్ కట్టను 1.45 మీటర్ల వెడల్పుతో పాటు 1.45 మీటర్ల ఎత్తు పెంచాలి, చెరువుల్లో పూడిక తీయించాలి, మత్తడి నిర్మాణం చేపట్టాలి. ప్రస్తుతం చెరువు మత్తడి తెగిపోయింది. చెరువులో నీరు నిల్వ ఉండటానికి మత్తడి ముందు మట్టికట్ట పోసి కొడిమ్యాల మండలానికి పంపింగ్ ద్వారా నీటిని తరలిస్తున్నారు. ప్రస్తుతం మట్టికట్టకు సైతం రైతులు గండి పెట్టారు.

గండ్లు పడుతున్న కట్టలు

రిజర్వాయర్ పనులు పూర్తి చేయకపోవడంతో చెరువుల్లోకి వరద ఉధృతి పెరిగి కట్టలకు గండ్లు పడుతున్నాయి. ముప్పై ఏళ్ల క్రితం నారాయణపూర్ చెరువు కట్టకు గండి పడింది. మూడేళ్ల క్రితం భారీ వర్షాలతో వెంకటాయిపల్లి వాగు ద్వారా నారాయణపూర్ చెరువుకు భారీగా వరద రావడంతో కట్ట ప్రమాద స్థాయికి చేరడంతో గ్రామానికి ప్రమాదం జరగకుండా అధికారులే చెరువుకట్టకు గండి పెట్టారు. వరద ఉధృతి పెరగడంతో నారాయణపూర్ చెరువును ఆనుకొని ఉన్న గంగాధర ఎల్లమ్మ చెరువు కట్టకు సైతం గండి పడింది. వివాదాల మధ్య చెరువు కట్టల మరమ్మతు చేసి నీరు నిల్వ చేస్తున్నారు. వేలాది ఎకరాలకు సాగు నీరందించే నారాయణపూర్ రిజర్వాయర్ పనులు పూర్తి చేయడానికి నీటి పారుదలశాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి హామీ ఇచ్చారు. నారాయణపూర్ గ్రామంలో నిర్వహించిన ప్రజాపరిపాలన గ్రామసభకు మంత్రి హాజరయ్యారు. ప్రాధాన్యత గల ప్రాజెక్టుల్లో నారాయణపూర్‌ను చేర్చి ప్రాజెక్టుకు అవసరమైన రూ.70 కోట్లు మంజూరు చేయడానికి హామీ ఇచ్చారు.

పనులు పూర్తి చేయాలి



ముంపు గ్రామాలకు, భూములు కోల్పోతున్న భూనిర్వాసితులకు పూర్తి స్థాయిలో పరిహారం అందించి రిజర్వాయర్ పనులు పూర్తి చేయాలి. రిజర్వాయర్ పనులు చేపట్టక పోవడంతో ప్రతి వర్షాకాలం చెరువు కట్టకు ఎక్కడ గండి పడుతుందోనని భయంభయంగా బతుకుతున్నాం.

నజీర్, మాజీ సర్పంచ్

త్వరలో పూర్తి చేయిస్తా



నారాయణపూర్ రిజర్వాయర్ పనులు పూర్తయితే వేల ఎకరాలకు నీరందుతుంది. చెరువులు, కుంటల్లోకి నీరు చేరుతుంది. ప్రాజెక్టు పనులకు అవసరమైన నిధులు మంజూరుకు మంత్రి హామీ ఇచ్చారు. ప్రాజెక్టు పనులు సీఎం దృష్టికి తీసుకెళ్లాను. నిర్వాసితులకు పరిహారంతో పాటు త్వరలో పనులు పూర్తి చేయిస్తా.

మేడిపల్లి సత్యం, ఎమ్మెల్యే

చిన్నారులకు అన్నప్రాసన, అక్షరాభ్యాసం


జంగపల్లిలో పిల్లలకు అక్షరాభ్యాసం


కన్నాపూర్ అంగన్‌వాడీలో ముందస్తు ఉగాది


మానకొండూర్: సభకు హాజరైన మహిళలు

గన్నేరువరం: మండలంలోని జంగపల్లి అంగన్‌వాడీ కేంద్రంలో శుక్రవారం చిన్నారులకు అక్షరాభ్యాసం, అన్నప్రాసన నిర్వహించారు. పిల్లలు, గర్భిణులు పోషకాహార పదార్థాలు తీసుకోవాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ కవిత తెలిపారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి అరుణ్‌కుమార్, అంగన్‌వాడీ టీచర్ అటికం రజిత, ఆశావర్కర్ పిస్కు శ్యామల తల్లులు, గర్భిణులు, బాలింతలు పాల్గొన్నారు.

బాలింతలు పోషకాహారం తీసుకోవాలి

మానకొండూర్: బాలింతలు పోషకాహారం తీసుకోవాలని అంగన్‌వాడీ సూపర్‌వైజర్ స్రవంతి అన్నారు. మండలంలోని గట్టుదుద్దెనపల్లి అంగన్‌వాడీ సెంటర్లో శుక్రవారం సభ నిర్వహించారు. బాలికలపై వివక్ష చూపొద్దని, లింగనిర్ధారణతో అబార్షన్ చేయించుకోవాలని ఒత్తిడి తీస్తే 1098 నంబర్‌కు కాల్ చేయాలన్నారు. పోషకాహారం ప్రాముఖ్యత వివరించారు. మహిళా సాధికారిక కేంద్రం జెండర్ స్పెషలిస్ట్ కవిత మాట్లాడుతూ.. డీహెచ్ ఈడబ్ల్యూ సేవలు, బాల్యవివాహాల నిషేధం, గృహహింస, వరకట్న నిషేధ చట్టం గూర్చి వివరించారు. మొబైల్స్‌తో జాగ్రత్తగా ఉండాలని, మహిళలు ఆపదలో ఉపయోగించుకోవాల్సిన నంబర్లు, మహిళల కోసం ప్రభుత్వం ప్రవేశపెడుతున్న పథకాలను ఉపయోగించుకొని ముందుకువెళ్లాలని తెలియజేశారు. అనంతరం పిల్లలకు అన్నప్రాసన చేశారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్ నరసమ్మ, ఆశా శిరీష తదితరులు పాల్గొన్నారు.

శంకరపట్నం: మండలంలోని కన్నాపూర్ అంగన్‌వాడీ కేంద్రంలో శుక్రవారం ముందస్తు ఉగాది వేడుకలు నిర్వహించారు. ముత్తారం, మొలంగూర్, కన్నాపూర్ అంగన్‌వాడీ కేంద్రాల్లో శుక్రవారం సభలో భాగంగా చిన్నారులకు అన్నప్రాసన, అక్షరాభ్యాసం చేయించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్లు అరుణ, పద్మ, వైద్యాధికారి శ్రావణ్, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

కల్యాణలక్ష్మి చెక్కులు పంపిణీ


చెక్కులు అందిస్తున్న ఎమ్మెల్యే సత్యం

చొప్పదండి: పట్టణంలోని క్యాంపు కార్యాలయంలో కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులను ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం శుక్రవారం లబ్ధిదారులకు పంపిణీ చేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ నవీన్ కుమార్, ఏఎంసీ చైర్మన్ కొత్తూరి మహేశ్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ఇప్ప శ్రీనివాస్‌రెడ్డి, మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ గుర్రం నీరజ, పెరుమాండ్ల గంగయ్యగౌడ్, నిజానపురం చందు, తిరుపతిగౌడ్, రంగయ్య, శ్రీనివాస్‌గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులను అభినందించిన ఎమ్మెల్యే

రామడుగు: మండలంలోని గోపాల్‌రావుపేట అక్షర పాఠశాల విద్యార్థులు మోక్షశ్రీ టి.చైత్ర, వేదశ్య నవోదయ పాఠశాల ఆరు, తొమ్మిదో తరగతిలో ప్రవేశానికి సీట్లు సాధించారు. శుక్రవారం చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం అభినందించారు. కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ మినుకుల మునీందర్, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

రైతుల భాగస్వామ్యంతోనే దేశవ్యాప్త ఖ్యాతి

చొప్పదండి: రైతుల భాగస్వామ్యంతో దేశవ్యాప్త ఖ్యాతిని సాధ్యమైందని చొప్పదండి పీఏసీఎస్ పర్సన్ ఇన్‌చార్జి ముమ్మడి లక్ష్మణాచారి అన్నారు. సొసైటీ వార్షిక సర్వసభ్య సమావేశం శుక్రవారం నిర్వహించగా ఆయన అధ్యక్షతన పలు తీర్మానాలు చేశారు. రైతులకు 2023–24 ఆర్థిక సంవత్సరంలో పదిశాతం డివిడెంట్ రైతుల ఖాతాలో జమ చేస్తామని తెలిపారు. సొసైటీ సిబ్బందికి ఒకనెల జీతం బోనస్‌గా ఇవ్వడానికి తీర్మానం చేశారు. కార్యక్రమంలో మాజీ అధ్యక్షుడు గుంటి మల్లయ్య, క్యాతం పురుషోత్తం, సీఈవో కళ్యాం తిరుపతిరెడ్డి, గుర్రం ఇంద్రసేనారెడ్డి, మాజీ డైరెక్టర్లు పాల్గొన్నారు.

‘ఏక్‌భారత్ శ్రేష్ఠ్ భారత్’పై విద్యార్థులకు అవగాహన


అవగాహన కల్పిస్తున్న ఉపాధ్యాయులు

ఇల్లందకుంట: మండలంలోని మల్యాల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ‘ఏక్‌భారత్ శ్రేష్ఠ్ భారత్’ కార్యక్రమంలో భాగంగా హర్యానా భాషపై ప్రభుత్వ ఆదేశానుసారం విద్యార్థులకు హిందీ భాష ఉపాధ్యాయురాలు రేష్మ శిక్షణ ఇచ్చారు. శుక్రవారం కార్యక్రమం ముగింపులో భాగంగా విద్యార్థులతో హర్యానా రాష్ట్ర వేషధారణ,నృత్యం, విద్యార్థుల సంభాషణలు, సంస్కృతి ప్రాముఖ్యతని తెలిపే విధంగా వినూత్న ప్రదర్శనలు చేశారు. హెచ్‌ఎం రాములు మాట్లాడుతూ.. రాష్ట్రాల మధ్య ఐక్యతను పెంచి భిన్నత్వంలో ఏకత్వాన్ని పెంపొందించడంలో ఏక్ భారత్ శ్రేష్ఠ్‌భారత్ ఎంతో దోహదపడుతుందన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు విజేందర్ రెడ్డి, రాజేందర్‌రెడ్డి, పద్మ, రాజేష్‌బాబు, ప్రణీత, రేష్మ, అరుణ, మురళి, సుధాకర్,రమ, సరిత విద్యార్థులు పాల్గొన్నారు.

ఉపాధిహామీ కూలీకి అస్వస్థత

శంకరపట్నం: మండలంలోని చింతగుట్ట గ్రామానికి చెందిన ఉపాధిహామీ కూలీ గణపతి శుక్రవారం అస్వస్థతకు గురయ్యాడు. గ్రామంలో ఉపాధి పనులు చేస్తుండగా అస్వస్థతకు గురికాగా ఆటోలో కరీంనగర్‌లోని ఆస్పత్రికి తరలించారు.

కోతుల దాడిలో ముగ్గురికి గాయాలు

శంకరపట్నం: కోతుల దాడిలో శుక్రవారం ముగ్గురికి గాయాలయ్యాయి. మండలంలోని మొలంగూర్‌కు చెందిన కన్నం నర్సింహాస్వామి, అంబాల్‌పూర్, ఏరడపల్లి గ్రామాల్లో ఒక్కొక్కరిని కోతులు గాయపరిచాయని స్థానికులు తెలిపారు. గాయపడిన వారికి కుటుంబ సభ్యులు కేశవపట్నం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్యం చేయించారు.

పీడీఎస్ బియ్యం పట్టివేత

గన్నేరువరం: అక్రమంగా పీడీఎస్ బియ్యం తరలిస్తున్న వాహనాన్ని గుండ్లపల్లి స్టేజీ వద్ద పట్టుకున్నామని ఎస్సై తాండ్ర నరేశ్ తెలిపారు. కరీంనగర్ చుట్టు పక్కల సేకరించిన 17 క్వింటాళ్ల బియ్యం సిద్దిపేటకు తరలిస్తుండగా పట్టుకొని కేసు నమోదు చేశామని ఎస్సై తెలిపారు. తిమ్మాపూర్ మండలం రేణికుంట నుంచి సిద్దిపేటకు ఇసుకను తరలిస్తున్న వాహనాన్ని గుండ్లపల్లి స్టేజీ వద్ద పట్టుకున్నామని ఎస్సై తెలిపారు. వాహనాన్ని సీజ్ చేసి డ్రైవర్, యాజమానిపై కేసు నమోదు చేశామన్నారు.

బీసీ రిజర్వేషన్ బిల్లు ఆమోదం కోసం ఉద్యమిస్తాం


మాట్లాడుతున్న బీసీ ఆజాదీ ఫెడరేషన్ నాయకులు

హుజూరాబాద్: బీసీ రిజర్వేషన్ బిల్లు ఆమోదం కోసం కేంద్రంపై ఒత్తిడి తెచ్చే బాధ్యత రాష్ట్ర ప్రభుత్వానిదేనని, ఉద్యమించే బాధ్యత మాదని బీసీ ఆజాదీ ఫెడరేషన్ వర్కింగ్ ప్రెసిడెంట్ కూడికాల భాస్కర్ అన్నారు. శుక్రవారం పట్టణంలోని బీసీ ఆజాదీ ఫెడరేషన్ జిల్లా కన్వీనర్ చిలుకమారి శ్రీనివాస్ అధ్యక్షతన విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. ఢిల్లీలో జక్కని సంజయ్ ఆమరణ నిరాహార దీక్షకు మద్దతుగా హుజూరాబాద్‌లో రిలే నిరాహార దీక్ష చేపడతామని బీసీలు విజయవంతం చేయాలని కోరారు. కేంద్ర ప్రభుత్వం బీసీ రిజర్వేషన్ బిల్లు అమలు చేయాలని, దేశవ్యాప్తంగా సమగ్ర కులగణనను చేపట్టాలని డిమాండ్ చేశారు.

క్లుప్తంగా

హమాలీ కార్మికులకు లైసెన్స్ పత్రాలు అందజేత


లైసెన్స్ పత్రాలందజేస్తున్న చైర్‌పర్సన్ స్వప్న

జమ్మికుంట: జమ్మికుంట వ్యవసాయ మార్కెట్ యార్డు పరిధిలో హమాలీ, దడువాయి కార్మికులకు మార్కెట్ చైర్ పర్సన్ పూల్లూరి స్వప్నసదానందం శుక్రవారం లైసెన్స్ పత్రాలను అందజేశారు. కొన్నేళ్లుగా మార్కెట్ పాలకవర్గం లేకపోవడంతో కార్మికుల లైసెన్స్ పత్రాలు రెన్యువల్ చేయలేకపోయారని చైర్‌పర్సన్ అన్నారు. పాలకవర్గం చొరవతో కార్మికులకు లైసెన్స్‌ను పత్రాలు అందించామన్నారు. అనంతరం కార్మికులు చైర్‌పర్సన్‌ను శాలువాలతో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో మార్కెట్ ఉన్నత శ్రేణి కార్యదర్శి మల్లేశం, గ్రేడ్–2 కార్యదర్శి రాజా, హమాలీ, దడువాయి సంఘం అధ్యక్షుడు ఎర్రబెల్లి రాజేశ్వర్‌రావు, కార్మికులు పాల్గొన్నారు.

ఆలయానికి విరాళం


మొక్కులు చెల్లించుకుంటున్న కుటుంబసభ్యులు

గన్నేరువరం: మండలంలోని ఖాసీంపేట శ్రీమానసాదేవి ఆలయానికి వేములవాడ మండలం శాత్రాజ్‌పల్లి గ్రామానికి చెందిన సామ తిరుపతిరెడ్డివిజయ, కూతుళ్లు సృజన, ఉదయ్‌శ్రీ శుక్రవారం రూ.50,116 విరాళంగా అందజేశారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు తీర్థప్రసాదాలను అందజేసి సన్మానించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ గౌరవ అధ్యక్షుడు చిన్న నర్సింహారెడ్డి, చైర్మన్ ఏలేటి చంద్రారెడ్డి, డైరెక్టర్లు, భక్తులు పాల్గొన్నారు.

పండుగలు స్నేహపూర్వక వాతావరణంలో జరుపుకోవాలి


మాట్లాడుతున్న ఏసీపీ శ్రీనివాస్‌జి

హుజూరాబాద్: పండుగలను స్నేహపూర్వక వాతావరణంలో జరుపుకోవాలని హుజూరాబాద్ ఏసీపీ శ్రీనివాస్‌జి అన్నారు. శుక్రవారం పోలీస్ స్టేషన్‌లో పీస్ కమిటీ సమావేశానికి హాజరై మాట్లాడారు. రాబోయే ఉగాది, రంజాన్, శ్రీరామనవమి, హనుమాన్ జయంతిని ప్రజలంతా కలిసిమెలిసి జరుపుకోవాలని కోరారు. డివిజన్ పరిధిలోని ప్రజలు పలువురికి ఆదర్శంగా నిలవాలన్నారు. పండుగల సమయంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా జాగ్రత్తలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో పట్టణ సీఐ తిరుమల్‌గౌడ్, పీస్ కమిటీ సభ్యులు పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రాచీన నైపుణ్యంతోనే వికసిత్ భారత్ సాధ్యం


మాట్లాడుతున్న ఆచార్య ఆనంద్ కిషోర్

హుజూరాబాద్: పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో రాష్ట్ర ఉన్నత విద్యా మండలి సౌజన్యంతో రెండు రోజులుగా వికసిత్ భారత్ 2047 విద్యావిధానం, భారతీయ జ్ఞానపరంపర ఏకీకరణ –ఆవిష్కరణలు –వ్యవస్థాపకత’ అనే అంశంపై నిర్వహిస్తున్న జాతీయ సదస్సు ముగింపు సమావేశం శుక్రవారం నిర్వహించారు. ముఖ్య అతిథిగా ఎన్ఐటీ వరంగల్ ప్రొఫెసర్ ఆనంద్ కిషోర్ మాట్లాడుతూ.. సాంప్రదాయ విజ్ఞానం నేర్చుకుంటూనే ఆధునిక నైపుణ్యాలు అలవర్చుకున్నప్పుడు వికసిత్ భారత్ ఆవిష్కరించబడుతుందని, సదస్సుల్లో అర్థవంతమైన చర్చలు చేపట్టినప్పుడు భావన ప్రజలకు చేర వేయవచ్చని సూచించారు. నేను నుంచి మనం, మనము నుంచి విశ్వం అనే భావనతో యువ వికసిత భారత్ సాధ్యమవుతుందని ప్రముఖ వ్యక్తిత్వ వికాస నిపుణుడు అయిత శ్రీనివాస్ అన్నారు. ఇందుకు ప్రాచీన భారత వ్యక్తిత్వ వికాస సూత్రాలు ఆధునిక పరిస్థితులకు అనువయించినపుడే సాధ్యమవుతుందన్నారు. అనంతరం వ్యక్తిత్వ వికాస మెలకువలపై విద్యార్థులకు మార్గ నిర్దేశం చేశారు. సదస్సు సమన్వయకర్త డాక్టర్ మల్లారెడ్డి సదస్సు నివేదిక సమర్పించారు. పలువురు వివిధ అంశాలపై ప్రసంగించారు. అనంతరం విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు అందరిని ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు లింగారెడ్డి, మైపాల్‌రెడ్డి, నరేందర్‌రెడ్డి, రేణుక, ఝాన్సీరాణి, సుమలత, స్వరూపారాణి, రమ, స్వప్న, పల్లవి, శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.



చొప్పదండి: పట్టణంలోని 13వ వార్డులో సీసీరోడ్డుపై ఏర్పడిన గుంత ప్రమాదకరంగా మారింది. శ్రీగాద గట్టయ్య ఇంటి సమీపంలోని గుంత మూలమలుపు వద్ద ఉండటంతో ప్రమాదాలు ఎక్కువగా జరుగుతున్నాయని, రాత్రివేళ వాహనదారులు ప్రమాదాలబారిన పడుతున్నారని, సంబంధిత అధికారులు ఇకనైనా స్పందించి చర్యలు తీసుకోవాలని ప్రయాణికులు, వాహనదారులు కోరుతున్నారు.

సమస్య పరిష్కారానికి సంప్రదించాల్సిన అధికారి
నాగరాజు, చొప్పదండి మున్సిపల్ కమిషనర్, సెల్ నంబర్: 99492 67882

వాట్సాప్ చేయండి..

మీ ప్రాంతంలో ఉన్న సమస్యను, దానికి సంబంధించిన ఫొటోను మాకు వాట్సాప్‌లో షేర్ చేయండి. ఆ సమస్య ఎప్పటి నుంచి ఉందో రాయండి. వాటిని ప్రచురించి సమస్య పరిష్కారానికి ‘సాక్షి’ కృషి చేస్తుంది.

మా ఫోన్ నంబర్లు: 9393557752, 9848408781, 8790144227

ఘనంగా పోచమ్మ బోనాలు



శంకరపట్నం: మండలంలోని కన్నాపూర్, ధర్మారం గ్రామాల్లో శుక్రవారం పోచమ్మ బోనాలు ఘనంగా నిర్వహించారు. మహిళలు నెత్తిన బోనాలతో ఆలయానికి చేరుకొని అమ్మవారికి నైవేద్యం సమర్పించారు. చల్లంగా చూడమ్మ పోచమ్మ తల్లి అంటూ మొక్కులు చెల్లించుకున్నారు.

ముగిసిన భాగవత సప్తాహ మహోత్సవం


ప్రవచానాలిస్తున్న నంబి గోపాలాచారి

మానకొండూర్: మండలంలోని గంగిపల్లి గ్రామంలో గోపాల మురళీకృష్ణ ఫంక్షన్ హాల్‌లో శ్రీమద్ భాగవత సప్తాహ మహోత్సవం శుక్రవారంతో ముగిసింది. అభినవశుక, పురాణ వాచస్పతి, శ్రీమాన్ శ్రీనంబి వేణుగోపాలాచారి ఆధ్వర్యంలో వారం రోజుల పాటు సప్తాహ మహోత్సవం నిర్వహించారు. పరమాత్ముని ఆరాధనతోనే ప్రశాంతత, సకల సంపదలు కలుగుతాయని, ప్రజల్లో ఆధ్యాత్మికత పెరిగితే లోకమంతా సుభిక్షంగా ఉంటుందన్నారు. ఈమహోత్సవంలో వైదిక నిర్వాహకులు జ్యోతిష్య వాస్తుపండితులు నమిలకొండ రమణాచార్యులు పూజా కార్యక్రమాలు అర్చనలు, ఆరాధనలు నిర్వహించారు. వంగపెల్లి సావిత్రమ్మ, రమేశ్‌రావు రేణుక, రాంగోపాల్‌రావువర్మా కుటుంబ సభ్యులు గ్రామపెద్దలు, పండితులు రామకృష్ణమాచార్యులు, వినయ్ స్వామి, బ్రహ్మశ్రీ రామశర్మ, నమిలకొండ రఘు రామాచార్యులు పండితులు పాల్గొన్నారు. పలు ప్రాంతాల నుంచి వచ్చిన ప్రముఖులు భక్త జనాబృందం, భాగవత కథామృతాన్ని శ్రవణం చేసి తీర్థప్రసాదాలు స్వీకరించారు, లోక కల్యాణార్థం కార్యక్రమం నిర్వహించినట్లు నిర్వహకులు తెలిపారు.

నవోదయలో స్పోర్ట్స్ డే



బహుమతులు అందిస్తున్న ఏసీపీ ప్రకాశ్


చొప్పదండి: జవహర్ నవోదయ విద్యాలయంలో శుక్రవారం స్పోర్ట్స్ అండ్ కల్చరల్ డే నిర్వహించారు. ముఖ్య అతిథిగా కరీంనగర్ ఏసీపీ శుభం ప్రకాశ్, సీఐ ప్రకాశ్‌గౌడ్ హాజరయ్యారు. అనంతరం వాలీబాల్ మ్యాచ్ ప్రారంభించారు. పోటీలలో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ మంగతాయారు, వైస్ ప్రిన్సిపాల్ బ్రహ్మానందరెడ్డి, ఎస్ఐ సురేందర్, తదితరులు పాల్గొన్నారు.

జర్నలిస్టుల ఇళ్ల సమస్య పరిష్కరిస్తాం


సన్మానిస్తున్న వొడితల ప్రణవ్

హుజూరాబాద్: జర్నలిస్టుల ఇళ్ల సమస్య పరిష్కరిస్తామని కాంగ్రెస్ పార్టీ హుజూరాబాద్ నియోజకవర్గ ఇన్‌చార్జి వొడితల ప్రణవ్ అన్నారు. శుక్రవారం ప్రెస్‌క్లబ్ సభ్యులు జర్నలిస్టుల ఇళ్ల సమస్యపై ప్రణవ్‌ను కలిశారు. ఇళ్ల స్థలాలపై కేసు వేసిన కాంగ్రెస్ నాయకుడు ఉపసంహరించేకునేలా చేయాలని, విద్యుత్ అధికారులతో మాట్లాడి మీటర్ల ఏర్పాటు కృషి చేయాలని ప్రెస్‌క్లబ్ అధ్యక్ష, కార్యదర్శి కాయిత రాములు, కామిని రవీందర్ కోరారు. అనంతరం ప్రణవ్ విద్యుత్ అధికారులతో మాట్లాడారు. త్వరలో కేసు పరిష్కారిస్తామని హామీ ఇచ్చి అధ్యక్ష, కార్యదర్శిని శాలువాలతో సన్మానించారు. అనంతరం ప్రెస్‌క్లబ్ సభ్యులు విద్యుత్ డీఈని కలిశారు. కార్యక్రమంలో ప్రెస్‌క్లబ్ ఉపాధ్యక్షుడు రవీందర్‌రెడ్డి, బొడ్డు శ్రీనివాస్, పోతరాజు సంపత్, తాటిపాముల దేవేందర్, నాగవెళ్లి రాజు తదతరులు పాల్గొన్నారు.

నల్ల బ్యాడ్జీలతో నిరసన



చొప్పదండి: పట్టణంలోని మసీద్ అక్సాలో శుక్రవారం మధ్యాహ్నం నమాజ్ అనంతరం ముస్లింలు ఆల్ ఇండియా ముస్లిం పర్సనల్ లాబోర్డు ఆధ్వర్యంలో వక్ఫ్ అమెండమెంట్ బిల్‌కు వ్యతిరేకంగా నల్లబ్యాడ్జీలతో నిరసన తెలిపారు. మసీద్ కమిటీ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

నియామకం



హుజూరాబాద్: బీఎస్పీ హుజూరాబాద్ నియోజకవర్గ ఇన్‌చార్జిగా గిన్నారపు మహేందర్‌ను నియమించినట్టు జిల్లా అధ్యక్షుడు నల్లాల శ్రీనివాస్ శుక్రవారం తెలిపారు. ఈసందర్భంగా మహేందర్ మాట్లాడుతూ... పార్టీ బలోపేతానికి కృషి చేస్తానని, నియామకానికి సహకరించిన జిల్లా నాయకులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు.